# విమల కమల

శ్రీ జొన్నలగడ్డ వేంకటరాధాకృష్ణయ్య

"నా పేరు విమల. మేం కాంగ్రిలో కాపరం ఉండేవాళ్లం. నవజీవన్ మెహతా నేనూ చిన్నప్పట్నుంచీ చదువుకొన్నాం. అతడు నన్ను "నువ్వే నా పెళ్లానివవుతా" వంటూ పరిహాసం చేసే వాడు చిన్నప్పుడు. నేను సిగ్గుతో నవ్వి పారిపోయే దాన్ని. అలా కొన్నాళ్లు గడిచిపోయాయి. ఆఖరుకు మాకిద్దరికే పెళ్లిఅయింది. చిన్ననాటిమాట నెరవేరింది. కాపరానికి కూడా వెళ్లాను. అతడు చదువు మానివేసి, ఆ గ్రామంలోనే జనరల్ స్టోర్స్ ఏర్పాటు చేశాడు. మేం సంతోషంగా జీవితాన్ని గడిపే వాళ్లం. కొంతకాలం జరిగింది. బొంబాయినుంచి, పూనానుంచి, కరాచీనుంచి, ఇంకా ఎక్కడెక్కడి నుంచో ఎందరో కంపెనీల కేన్వాసింగు ఏంజంట్లువచ్చి, అమ్మడానికి వస్తువులు సప్లయిచేసి వెళుతూంటేవారు. నా భర్తకు ఆ స్టోర్సులోని అమ్మకాలతో ఎడతెరిపి ఉండేదికాదు. ఆ వచ్చిన ఏజంట్లని గౌరవించి, మర్యాదచేసే భారం నామీదపడింది. ఒకొక్క రోజున, ఆయనతో మాట్లాడ్డానికి వ్యవధిలేక, రాత్రి కూడా ఉండిపోయేవారు ఆ ఏజంట్లు. వాళ్లకి భోజనాలు—కాఫీలు—ఫలాహారాలు అన్నీ నేనే ఏర్పాటు చేసేదాన్ని. ఆఊళ్లో పాఠశాలలో చిన్న చదువు చదివినా, యింగ్లీషు ముక్కలు మధ్యమధ్యన దొర్లిస్తూ, వాళ్లతో అన్ని విషయాలనుగురించీ ముచ్చటించేదాన్ని. ముఖ్యంగా పత్రికలు అన్నీ చదివేదాన్ని. సినీమాలను గురించి, దేశంలోని రాజకీయాలనుగురించి,మాట్లాడుతూ వుంటే, నా విజ్ఞానానికి ఆ ఏజంట్లమాట ఎలావున్నా నా భర్తకే ఎంతో ఆనందంగా ఉండేది.

♦ ♦ ♦

రెండు మూడు సంవత్సరాలు గడిచినవి. నా భర్త స్టోర్సును విస్తరింపచేద్దామని, ఒక పెద్ద మేడ కట్టించారు. స్టోర్సు దానిలోకిమారినా, కాపరంమేం సొంతడాబాలోనే. ఆ బంగాళానను సరించే చిన్న తోటకూడాఉంది. ఆయన నన్ను అపారమైన ప్రేమతో చూసేవారు. ఆ ఆదరణకు మితిలేదు. ఏంకావలసినా నేనే కొనుక్కునేదాన్ని. నగలు—చీరలు—ఒకటేమిటి? అన్నీ సమృద్ధంగా ఉండేవి. ఎన్నిఉన్నా—ఏదో చెప్పరాని ఆవేదన మనస్సును దహించివేసేది. ఏదో జీవితంలో కొరతగా కనిపించేది. అది ఏమో నేనే నిర్ణయించలేకపోయేదాన్ని.

ఒకనాడు బొంబాయినుంచి, ఏంజెలిస్ కంపెనీ ఏజంటు వచ్చాడు. అతని పేరు శ్యామలాల్. అతనితో పని ఇంకా మిగిలిపోయింది కాబోలు—ఆరాత్రికి ఉండిపోవలసివచ్చింది. నౌకరునిచ్చి, మాయింటికి పంపించారు అతణ్ణి. "ఇంకా ఎవరెవరో ఏజంట్లు వచ్చారని, అయ్యగారు రావడానికి ఆలస్యం అవుతుందికనక, శ్యామలాలుకు భోజనంపెట్టి, నన్నుకూడా తిన"మన్నారని నౌకరు చెప్పాడు.

పాతికేళ్లుంటాయో వుండవో, శ్యామలాలు చాలా అందంగాఉన్నాడు. మామూలు ధోరణిలోనే మాట్లాడి, భోజనం వడ్డించాను. "మీరుకూడా తినండి. ఆయన ఇంతలో ఎలాగా రారుకదా!" అని అతడు పట్టుపట్టాడు. భోజనసమయంలో ఏవేవో కబుర్లు చెప్పుకున్నాం. అతడు తనకింకా పెళ్లికాలేదనీ—తన చెల్లెలికి మొన్నమొన్ననే పెళ్లి అయిందని ఏవేవో చెప్పుకువచ్చాడు. భోజనమైనతర్వాత డాబామీద కుర్చీల్లో కూర్చున్నాం. వెన్నెల హాయిగాఉంది. "మీకు తోటకూడా ఉందే" అన్నాడు.

"రండి, చూద్దురుగాని" అన్నాను. ఓమూల గులాబీపూల వాసన—మరోవంక రేరాణి పరిమళము—మరోప్రక్కనుంచి సన్న జాజి సుగంధమూ—అన్ని నా హృదయంలో ఏవో తీయని వలపు తలపులు తెచ్చిపెట్టాయి. చిరకాలానికి, ఎండిపోయిన నా చిత్తంలో అతడు మాట్లాడుతూఉంటే ఏదో అమృతం వర్షించి నట్లయింది,

"ఎంత బాగుందండీ తోట. మెహతాగారు అదృష్టవంతులు—అపార భాగ్యం—అసమాన సౌందర్యం గల అర్ధాంగి" అని, నావంక చూశాడు. ఆ చూపు నా హృదయాన్ని దూసుకుపోయింది. "ఎన్నివుంటే ఏంలాభం—నా జీవితంకంటే శుష్క మరుభూమి మేలు" అన్నాను. అతను నా అభిప్రాయాన్ని గ్రహించాడు కాబోలు—నా చేయిపట్టుకున్నాడు—'వద్దు' అన్నాను. దగ్గరకు తీసుకున్నాడు. ఆ ఆలింగనాన్ని విదిలించుకోలేకపోయాను. బలమైన అతని కౌగిలిలో ఎంతసేపు అలా నలిగిపోయానో—కళ్లు తెరిచి చూసేసారికి ఆకాశాన చందమామ మేఘాల చాటుకు పోయివున్నాడు. నా దుర్బలత్వానికి నేనే సిగ్గుపడ్డాను.

"అయ్యో! ఎంతసేపయింది? వెళ్లిపోదాం" అన్నాను. లోపలికి వెళ్లాం. ఇంకా నా భర్తరాలేదు.

ఆప్పట్నుంచీ నాయెదలో ఏవో తహతహలు బయలుదేరాయి, శ్యామలాలు వచ్చినపుడల్లా వినూత్నానందంతో నా హృదయం స్పందిస్తూఉండేది. ఇలాఉండగా, బొంబాయినుంచి కొందరువర్తకులువచ్చి, అలాంటి 'స్టోర్సు' ఊరికొకటిచొప్పున పెడదామని, నా భర్తను మేనేజరుగాఉండమని—జీతమేగాక లాభంలో వాటాయిస్తామని కోరారు. ఆయన నన్ను అడిగారు ఏంచేద్దామని. "బొంబాయిలో కాపరం ఉండాలి. సరే, శ్యామలాలును తరుచు చూడవచ్చు. వాళ్లయింటికికూడా వెళ్లవచ్చు" అని, సరే అన్నాను.

◆ ◆ ◆

బొంబాయిలో మలబారు హిల్సుమీద మా కాపరం. నగరంలో మావారిపని. కారుమీద హాయిగా కులాసాగా తిరగడం. క్రొత్తక్రొత్త స్నేహితులతో రోజుకోసినీమా చూడ్డం—టాజ్, గ్రీన్సు, ఎరాస్, రిట్జ్ హొటళ్లకు పోవడం—డాన్సులు—విందులు—అంతా స్వర్గం క్రిందతోచేది. శ్యామలాలుతో ఓనాడు ఒక చిత్రకారుడు వచ్చాడు. అతని పేరు గిరిజాశంకర్ ట. "మీ చిత్తరువు రచిస్తాను. మా స్టుడియోకు ఓసారి రండి'' అని ఆహ్వానించాడు.

మరునాడు అక్కడికి వెళ్లాను. మనోజ్ఞమైన ఆ అలంకరణ—ఆ పూర్తిఅయినవి—సగంసగంమాత్రమే రాసినవి—త్రివర్ణ చిత్రాలు చూస్తే బ్రహ్మానందం కలిగింది. అజంతా, ఎల్లోరా శిల్పం అతని రచనలలో మూర్తీభవించింది. ఆ ఆలోచనతో కూడిన అతని నేత్రాలలో ఏదో క్రొత్త ఆకర్షణ స్ఫురించింది. ఆ కుంచెలో—అతని విలాసంలో—చూపులో—మాటలో ఎంతో భావంఉంది.

మీ అందంలో—దేవిక, శాంత, కణన్, వీరి సౌందర్యం ఏపాటిది?" దనేవాడు. నా చిత్తరువు వేసేటప్పుడు ఇలా కూర్చోండి—అలా త్రిప్పండి" అని రకరకాల పోజుల్లో కూర్చోపెట్టాటప్పుడు అతని కరస్పర్శ అయితే ఒళ్లు ఝల్లుమనేది. శ్యామలాలులో అహస్కరుని తీక్షణత ఉంటే—ఇతనిలో సుధాంశుని ప్రశాంతత ఉంది. అతని మాటల్లో సముద్రఘోష ఉండేది. ఇతని వాక్కులు తేనెసోనలు. చూసినవారు చెప్పారేకాబోలు, నా భర్త "రోజూ స్టుడియోకు ఎందుకూ వెళ్లడం?" అని ఓసారి అడిగారు.

"నా ప్రతిమకోసం"—

"అలా అయితే నీ ఫోటో యియ్యి. నువ్వు ఒక్కర్తివీ రోజూ వెళ్లడం అంత మంచిపనికాదు." అన్నారు—

"పాడులోకం. ఏ సన్యాసులో చూసి మీతో చెప్పారుకాబోలు. కిట్టని దరిద్రులు—శంకర్ చాలా మంచివాడు" అన్నాను.

"సరే. అయితే నీయిష్టం" అని ఆయన వెళ్లిపోయారు. నాలుగురోజులైంది. స్టుడియోలో నన్ను కూర్చోబెట్టి బొమ్మగీస్తూ "మీ ప్రతిమ ఇంక నాలుగు రోజుల్లో పూర్తిఅయిపోతుంది. ఏదీ—అలాకాదు. మొహం ఇలా పెట్టి నించోండి"అని దగ్గరకువచ్చి, గడ్డం పట్టుకుని ప్రక్కగాత్రిప్పి "ఈ అమరసౌందర్యం అనుభవించడానికి ఎన్ని జన్మాలు తపస్సుచేశారో'' అన్నాడు. నేను "అంత అందంగాఉన్నానా? మీ పొగడ్తకాని" అన్నాను—

"ఇదిఅంతా అందపు ముద్ద" అని, నా బుగ్గమీద వ్రేలితో ఓదెబ్బ కొట్టాడు. నా హృదయంలో ఏదో ఉద్రేకం కలిగింది. మోహావిలమైన అతని దృక్పాశం నన్ను బంధించింది. అవశనైపోయాను. పడిపోబోతూంటే గిరిజాశంకర్ పట్టుకుని సోఫామీద పరుండబెట్టాడు.

అతడు తరుచు మాయింటికి వస్తూండేవాడు. ఇద్దరమూ నాటకాలకి సినీమాలకి వెళ్లేవాళ్లం. అతని స్నేహం మంచిది కాదనీ—అతడు "అన్‌పాప్యులర్ మాన్" అని మావారు అనడం—నేను అలాకాదని సమర్థించడం జరిగేది. ఓనాటిరాత్రి ఎనిమిదిగంటలకి వచ్చాడు గిరిజాశంకర్ టీ యిచ్చాను. రేడియోలో సుందరీబాయి పాడుతోంది. ఇద్దరమూ కుర్చీల్లో కూర్చుని కబుర్లు చెప్పుకున్నాం. గడియారం తొమ్మిది కొట్టింది. అతడు వెళ్లిపోడానికి లేచాడు. నేను దగ్గిరగా నుంచుని "రేపువస్తావా, నేనురానా?" అని అడిగాను. "నువ్వురా" అని దగ్గరకు తీసుకుని కావిలించుకొని, ముద్దుపెట్టుకున్నాడు. ఇద్దరము మైమరచి ఎంతసేపు వున్నామో. బయట జోడు చప్పుడయింది. చూసేసరికి నాభర్త. శంకర్ తన టోపీతీసుకుని మాట్లాడకుండా వెళ్లిపోయాడు. నాభర్త నావంక చూసి "నీకు యీపని న్యాయమేనా? అని అడిగారు.

"నే వతణ్ణివిడిచి వుండలేను" అన్నాను.

"సరే!" అని, ఆయన వెళ్లిపోయారు. ఏమీ అనలేదు.

మరునాడు స్టుడియోకు వెళ్లి "శంకర్! నా భర్తకూ నాకూ సంబంధం లేదు. ఇంక మనమిద్దరమే భార్యాభర్తలం" అన్నాను.

అతడు తెల్లబోయి "అదేం" అన్నాడు. ఆయన్ని వదిలివేశాను. మనకెందుకీ దాగిలిమూతలు? స్వేచ్ఛగా ఉందాం" అన్నాను. అతనికి నాపని సంతోషం కలిగించలేదు. అప్పుడే ఆ యింటియజమానివచ్చి, అద్దెకోసం అల్లరిచేశాడు శంకర్ని. ఆరునెల్లఅద్దెబాకీ అని తెలుసుకుని, అతడు వద్దన్నా వినక యిచ్చేశాను. అతనికి నూట్లు కుట్టించాను అతని అప్పులన్నీ తీర్చేశాను. శ్యామలాలు కలుకత్తా వెళ్లిపోయాడనీ, పెళ్లి చేసుకున్నాడనీ ఉత్తరం వచ్చింది.

◆ ◆ ◆

నాలుగు నెలలయింది. నామనస్సుకి అతనితో స్నేహం శాశ్వతమైన సంతుష్టి కలిగించలేకపోయింది. ఒకనాటివుదయాన ఒకామె వచ్చింది. ఆమెనుచూసి, శంకర్ వణికిపోయాడు—

"దుర్మార్గుడా! ఇదెవత్తె దీన్ని పెట్టుకు కులుకుతున్నావు, రా" అంది. ఆమె అతనిభార్య అని గ్రహించాను. నాతో పెళ్లికాదని చెప్పి నమ్మించాడు. నన్ను ఎరగనట్లు ఆమెతోకూడా వెళ్లిపోయాడు.

నేను నిర్ఘాంతపోయి అలాగే నిలబడిపోయాను. నాకళ్లను కప్పివేసిన కామాంధకారపుపొర మంచులా విడిపోయింది. నాలుగుమాసాల్లో నాలుగువేల రూపాయలు కర్చయినవి. అది నాకు విచారం కలిగించలేదు. భ్రమలోపడి, మనసారా ప్రేమించిన మగని వదలి, వంచించబడ్డానే — పవిత్రహృదయుడై నాస్వామిని తిరస్కరించి ద్రోహంచేశానే. నాపాపానికి నిష్కృతి వుందా?" అని గుండె పగిలేటట్లు ఏడ్చిఏడ్చి, తిన్నగా ఒకహోటలుకుపోయాను. నా దగ్గర రెండుమూడు రూపాయలున్నాయి. కర్తవ్యం తోచింది కాదు. ఆరాత్రి భోజనం చెయ్యనేలేదు. మర్నాడు న్యూస్ క్రానికల్ పత్రిక కొన్నా. దానిలో "నవజీవన్ మెహతా ద్వితీయవివాహం" అన్న శీర్షిక వుంది. నా గుండెలు కొట్టుకొన్నాయి. అంతకుముందు రోజునే కమల అనే పిల్లను పెళ్లిచేసుకొన్నారని రాస్తూ ఆ పత్రిక యిద్దరి ఫొటోలూ ప్రకటించింది. నా విచారానికి అంతంలేకపోయింది. తిన్నగా బయలుదేరాను. ఎక్కడికో నాకే తెలవదు. వెళ్లివెళ్లి ప్రిన్సెస్ వీధిమొగలో నిలబడ్డాను. కళ్లు తిరుగుతున్నై. నీరసంచేత కాళ్లు తేలిపోతున్నాయి. రంయిమని ఒకకారు వస్తోంది. మరోప్రక్కనుంచి లారీ వచ్చింది. రెండూ డీకొన్నై. కారు తలక్రిందైనది. కారు నెంబరు చూశాను. ఆ కారులోనే నేనెన్నోసార్లు ఎక్కి తిరిగాను. అది మాదే. నా హృదయం మహోద్వేగం పొందింది. అక్కడ గుమిగూడిన జనంలో త్రోవచేసుకు వెళ్లాను. అందులో—నా హృదయేశుడు—నాస్వామి స్మృతిహీనుడై పడివున్నాడు. ముఖానికి విండ్‌స్క్రీన్ గ్లాస్ గ్రుచ్చుకుని ఫాలభాగంపైన పెద్దగాయమయింది. ఆ గాయాన్నుంచి రక్తం స్రవిస్తోంది. వెంటనే చీరచించి గాయానికి కట్టుకట్టాను. ఆయనే డ్రైవ్ చేస్తూన్నారు. అటూ యిటూ చూశాను. ఒకడ్రైవరువచ్చి "అమ్మా! రండి, ఆస్పత్రికి తీసుకువెడదాం" అన్నాడు. కారు తిన్నగా ఆస్పత్రిదగ్గర ఆగింది. నాస్వామికి నేనుచేసినద్రోహం నన్ను నిలువునాదహించివేస్తోంది. డాక్టరు గాయానికి కట్టుకట్టాడు. సాయంకాలం ఆరుగంటలకి ఆయనకు స్మృతివచ్చి, కళ్లు తెరిచి చూశారు. పాదాలదగ్గరవున్న నావంక దృష్టిసారించారు. ఓసారి ఆయనవంకచూసి, తలవంచేసుకున్నాను.

నా నేత్రాలనుంచి విచారాశ్రువులు ధారగా ప్రవహించి, ఆయనపాదాల్ని తడిపివేశాయి.

"విమలా!" అన్నారు గద్గదకంఠంతో—

"నన్ను క్షమించరూ?" అన్నాను.

ఆయనకళ్లనుంచి అశ్రుబిందువులు జాలువారాయి.

"అపరాధిని. ద్రోహిని. నా దైవాన్ని తిరస్కరించి వెళ్లిపోయిన ఫలితం అనుభవించాను. నన్ను క్షమించరూ? నన్ను రక్షించరూ? మీపాదసేవకు అనుమతినీయండి. మీ దాసిగా వుంటాను" అన్నాను. నాకు ఏడుపు ఆగలేదు. బొరుమని ఏడ్చాను.

"ఏడవకు విమలా! నిన్ను స్వీకరించి కమలను ఏంచెయ్యను?"

"ఉంటుంది. ఆమె తినగా మిగిలినదే తింటాను. ఆమె విడిచిన చీరనే ధరిస్తాను. మీకేకాదు— ఆమెకూ పాదసేవచేస్తాను."

"వద్దు. అంతమాట వద్దు. నువ్వే నాకు అక్కవు. ఇద్దరమూ కలిసివుందాం" అన్నమాటలు వినిపించినై. వెనక్కు తిరిగిచూశాను. కమల!

ఇప్పుడు నేను తిరిగి స్వామిసౌభాగ్యగర్వితను. నా ఆనందానికి అవధిలేదు. ఇప్పటికీ పొరపాటున ఆయన నన్నే కమలా! అంటూంటారు. నేను చేసిన తప్పుపనికి ఆమాత్రం శిక్షయినా వుండవద్దూ?